నిండుకుండలా హిమాయత్ సాగర్



జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి. చెరువులు, కుంటలు జలకళను సంతరించుకున్నాయి. పంటలకు జీవం వచ్చింది. ఇంకా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జిల్లాలోని జంట జలాశయాలు ఉస్మాన్‌సాగర్, హిమాయత్ సాగర్‌లు నిండు కుండను తలపిస్తున్నాయి. ఈ సందర్భంగా జలమండలి అధికారులు రేపోమాపో హిమాయత్ సాగర్ ప్రాజెక్టు గేట్లు ఎత్తే అవకాశాలున్నాయి. - ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్, రంగారెడ్డి జిల్లా

ఘనంగా వృక్షాబంధన్



వృక్షానికి రాఖీ కడుతున్న విద్యార్థులు

పర్యావరణ పరిరక్షణకు ప్రతీఒక్కరు కృషి చేయాలని కౌన్సిల్‌ఫర్‌గ్రీన్ రెవల్యూషన్ అధ్యక్షురాలు లీలాలక్ష్మారెడ్డి అన్నారు. భావితరాల మనుగడకు మొక్కలు నాటాలని ఆమె సూచించారు. కడ్తాల మండలం అన్మాస్‌పల్లిలో బుధవారం వృక్షాబంధన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని వృక్షాలకు రాఖీలు కట్టారు. "నేను నీకు రక్ష.. నువ్వు నాకు రక్ష మనమందరం భూమాతకు రక్ష" అనే నినాదంతో విరివిగా మొక్కలు నాటాలని లీలాలక్ష్మారెడ్డి అన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, సీజీఆర్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

- కడ్తాల్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి)

ఎయిర్‌పోర్టులో సిరాజ్‌కు ఘనస్వాగతం



శంషాబాద్ రూరల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : ఇంగ్లాండ్‌తో జరిగిన టెస్టు సిరీస్‌లో సత్తాచాటి భారత్ విజయంలో కీలక పాత్ర పోషించిన హైదరాబాద్‌కు చెందిన క్రికెటర్ మహ్మద్ సిరాజ్ బుధవారం అర్ధరాత్రి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. విమానాశ్రయంలో క్రీడాభిమానులు, కుటుంబ సభ్యులు, బంధువులు ఘన స్వాగతం పలికారు. అయితే ప్రభుత్వం తరఫున, హెచ్‌సీఏ తరఫున స్వాగతం పలికేందుకు ఎయిర్‌పోర్టుకు ఎవరూ రాకపోవడంపై క్రీడాభిమానులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశానికి, రాష్ట్రానికి ఎంతో పేరు ప్రఖ్యాతలు తీసుకొచ్చిన సిరాజ్‌కు అవమానం జరగడంపై మండిపడ్డారు. సిరాజ్ ఎయిర్‌పోర్టులోకి రాగానే అభిమానులు కేరింతలు కొట్టి సిరాజ్ భాయ్ జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. ఎయిర్‌పోర్టు నుంచి ప్రత్యేక భద్రత మధ్య ఆయన ప్రత్యేక కాన్వాయ్‌లో నగరానికి బయలుదేరి వెళ్లారు.

తెగిన ఆదారం

దయనీయ స్థితిలో చేనేత పరిశ్రమ
కనిపించని నేతన్నలు..
వినిపించని మగ్గం చప్పుళ్లు
ఉపాధి లేక రోడ్డున పడిన కుటుంబాలు
నేడు జాతీయ చేనేత దినోత్సవం

7





తగ్గేదేలే అంటున్న టమాట
సెంచరీ కొట్టిన పచ్చిమిర్చి
బెంబేలెత్తిస్తున్న బీన్స్
జిల్లాలో తగ్గిన సాగు విస్తీర్ణం
పెరిగిన రవాణా ఖర్చులు

సంతలో సామాన్యుల జేబుకు చిల్లు

కొనలేం.. తినలేం!

భగ్గుమంటున్న కూరగాయల ధరలు

కూరగాయల ధరలు ఆకాశాన్నంటడంతో సామాన్యులు ఏం కొనలేం.. ఏం తినలేం అంటున్నారు. రేట్లు అమాంతం పెరగడంతో మార్కెట్‌లో కూరగాయలను ముట్టుకునే పరిస్థితి లేదంటున్నారు. కూరలు వండుకునే కంటే పచ్చడి మెతుకులే నయమంటున్నారు. ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్‌కు సరిపోను కూరగాయలు ఉత్పత్తి చేసే జిల్లాలోనే కూరగాయల ధరలు ఇలా ఉన్నాయంటే.. మిగతా ప్రాంతాల పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. రియల్ ఎస్టేట్ ప్రభావం, ప్రభుత్వం నుంచి రైతులకు ప్రోత్సాహం కరువవడంతో ఏటేటా సాగు విస్తీర్ణం తగ్గి దిగుమతి పడిపోతుంది. అంతేకాకుండా రవాణా ఖర్చు కూడా పెరిగిపోవడంతో కూరగాయల ధరలపై ప్రభావం పడింది.

ధరలు ఇలా.. (రూ.లలో)				జీట్‌రూట్	40
పచ్చిమిర్చి	100	బెండ	60	ఆలుగడ్డ	40
బీన్స్	80	చిక్కుడు	60	ఉల్లిగడ్డ	30
గోకర	60	కాకర	60	క్యాబేజీ	30
చామగడ్డ	80	టమాట	50	కాలీఫ్లవర్	30
క్యారెట్	60	దొండ	40	కీర	40
మునగ	60	బీర	60	ఆకుకూరలు	
వంకాయ	40	వంకాయ	40	కట్టకు రూ.10	

రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : వంటింట్లో కూరలు ఉండకడం లేదు. రైతు బజార్లు, వారాంతపు సంతలు, మార్కెట్‌లో కూరగాయల ధరల మోత మోగుతోంది. ఏ కూరగాయ ధర చూసినా కిలో రూ.40కి పైనే ఉంది. సాగు విస్తీర్ణం తక్కువగా ఉండట, వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేక పోవడం రేట్లపై ప్రభావం చూపుతోంది. వర్షాకాలం వచ్చినా అవసరాలకు సరిపడా కూరగాయల ఉత్పత్తి లేక ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి పరిస్థితి నెలకొంది. పెరిగిన రవాణా ఖర్చులు ధరలపై ప్రభావం చూపుతోంది. ధరలు రోజు రోజుకు పెరుగుతుండటంతో పేద, మధ్య తరగతి కుటుంబాలు కూరగాయలను కొనాలంటేనే భయపడుతున్నారు. మార్కెట్‌కు రూ.500 తీసుకెళ్తే ఐదారు రకాల కూరగాయలు కూడా రావడం లేదు. గతంలో సంతకు రూ.200 తీసుకెళ్తే సంచినిండా కూరగాయలు వచ్చేవని.. ఇప్పుడు ఆ పైసలకు రెండు రకాలు కూడా

మిగతా 8వ పేజీలో...

కూరగాయల సాగును ప్రోత్సహించాలి



ఒకప్పుడు హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు సరిపోయేంత కూరగాయలు పండించేవారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం కారణంగా ఏటేటా కూరగాయల సాగు తగ్గుతూ వస్తుంది. ఈ పంటల సాగుకు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం కరువైంది. గతంలో కూరగాయ విత్తనాలు సబ్సిడీపై అందించేవారు. రానురాను సబ్సిడీ ఎత్తేశారు. ఎరువులు, విత్తనాలు రాయితీపై అందించాలి.

జి. మల్లేష్ యాదవ్, మొయినాబాద్

ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాలు సాధిద్దాం

» కలెక్టర్ నారాయణరెడ్డి



జయశంకర్ సార్‌కు నివాళులర్పిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర సాధనకు తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప వ్యక్తి ఆచార్య కొత్తపల్లి జయశంకర్ అని కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అన్నారు. బుధవారం ప్రొఫెసర్ జయశంకర్ 91వ జయంతిని కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆచార్య పాత్ర మరువలేనిదని, ఉద్యమానికి వెన్నుముకగా నిలిచారని కొనియాడారు. ఆయన విద్యార్థి దశ నుంచే తెలంగాణలో జరుగుతున్న అన్యాయం, అసమానతలపై పోరాటం చేశారని తెలిపారు. స్వరాష్ట్రం సాధన కోసం తన జీవితాన్నే అంకితం చేశారని తెలిపారు. అధ్యాపకుడిగా ఆయన ఎంతో మందికి మార్గనిర్దేశం చేశారని, వృత్తిపట్ల నిబద్ధతను, తెలంగాణ ఉద్యమం పట్ల చిత్తశుద్ధిని నూరిపోశారని. ఆయన అడుగు జాడల్లో ప్రతీ ఒక్కరు నడవాలన్నారు. రాష్ట్ర అభివృద్ధికి ప్రణాళికలు సైతం రూపొందించారని, ఆయన ఆశయాల సాధన కోసం సమష్టిగా కృషి చేయాలని కలెక్టర్ అన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, కలెక్టరేట్ ఏవో సునీల్ కుమార్, బీసీ వెల్ఫేర్ అధికారి కేశురాం, బీసీ సంఘాల నాయకులు మల్లేష్ యాదవ్, జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డబుల్ ఇళ్ల పెండింగ్ పనులు పూర్తిచేయాలి

జిల్లాలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల పెండింగ్ పనులను పూర్తి చేయాలని కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రభుత్వ పథకాల అమలుతీరుపై సమీక్షించారు. డబుల్ బెడ్ రూం ఇళ్లకు ఇప్పటికే ఎంపికైన లబ్ధిదారులకు కేటాయింపు ఇవ్వడానికి స్థానిక ప్రజాప్రతినిధులతో అధికారులు సమన్వయం చేసుకోవాలని తెలిపారు. విద్యుత్ సంబంధిత పనులతో పాటు గృహ సముదాయాల్లో నీటి సరఫరా సంపుల నిర్మాణాన్ని పూర్తి చేసి, 15 రోజుల్లోగా లబ్ధిదారులకు ఇళ్లను అప్పగించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. హౌసింగ్ పీడీ నాయక్, అధికారులు పాల్గొన్నారు.

నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయండి

» డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి

షాద్‌నగర్, ఆగస్టు 6: (ఆంధ్రజ్యోతి): జాతీయ నులి పురుగుల దినోత్సవాన్ని విజయవంతం చేయాలని షాద్‌నగర్ డివిజన్ డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రిలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 11వ తేదీన జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు వేయించాలని సూచించారు. ఈ మాత్రలను మింగడం వల్ల పోషకాల గ్రహీతను మెరుగుపరుస్తుందని తెలిపారు. ఒకటి నుంచి రెండేళ్ల వయసున్న వారికి సగం మాత్రను పొడిచేసి నీటిలో కలిపి ఇవ్వాలన్నారు. రెండు నుంచి మూడేళ్ల వయసున్న వారికి ఒక మాత్రను పౌడర్‌గా చేసి నీళ్లలో కలిపి తాగించాలన్నారు. 4 -19 ఏళ్ల వయసు వారికి పూర్తి మాత్ర ఇచ్చి నమిలి మింగాలని సూచించారు. సమావేశంలో హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాస్ తదితర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

క్లినిక్ నిర్వాహకులు నిబంధనలు పాటించాలి

» జిల్లా ఉప వైద్యాధికారి నాగేంద్రబాబు



షోకాజ్ నోటీస్ అందజేస్తున్న నాగేంద్రబాబు

శంకర్‌పల్లి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా క్లినిక్‌లు నిర్వహిస్తే చర్యలు తప్పవని జిల్లా ఉపవైద్యాధికారి నాగేంద్రబాబు హెచ్చరించారు. ప్రొద్దటూరు, శంకర్‌పల్లి మున్సిపల్‌లోని ఆర్ఎంపీ క్లినిక్‌లు, డయాగ్నొస్టిక్ సెంటర్‌లను ఆయన వైద్యురాలు రేవతిరెడ్డితో కలిసి బుధవారం తనిఖీ చేశారు. నిబంధనలు పాటించని ఐదు క్లినిక్‌లకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వారం రోజుల్లో సమాధానం ఇవ్వాలని ఆదేశించారు. ఆర్ఎంపీలు ప్రాథమిక చికిత్స మాత్రమే చేయాలని, క్లినిక్‌లలో బెడ్లు వేసి వైద్యం చేయరాదని స్పష్టం చేశారు. అలాగే ఇంజక్షన్లు సైతం ఇవ్వరాదన్నారు.

ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడాలి

» షాద్‌నగర్ ఏసీపీ లక్ష్మీనారాయణ



రికార్డులను పరిశీలిస్తున్న ఏసీపీ

ఆమనగల్లు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ఫిర్యాదుదారులతో మర్యాద పూర్వకంగా నడుచుకోవాలని షాద్‌నగర్ ఏసీపీ లక్ష్మీనారాయణ సూచించారు. బుధవారం ఆయన ఆమనగల్లు పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. స్టేషన్ ఆవరణ, రికార్డులను పరిశీలించారు. సీఐ జానకిరామ్ రెడ్డి, ఎస్ఐ వెంకటేశ్‌లతో సమావేశమై పెండింగ్ కేసుల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు.

కమ్మేస్తున్న కాలుష్యం

దుమ్మూ ధూళితో రోగాల బారిన ప్రజలు
కలుషితమతున్న భూగర్భ జలాలు
ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు
పత్తాలేని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సిబ్బంది
కంపెనీలు తరలించాలని స్థానికుల డిమాండ్

పరిశ్రమల నుంచి వెలువడుతున్న వ్యర్థాలు



ఆదిభట్ల, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం మండలంలోని పోచారం గ్రామానికి పరిశ్రమలతో ప్రమాదం పొంచి ఉంది. వాటి నుంచి వెలువడుతున్న విషవాయువులు గ్రామాన్ని కమ్మేస్తున్నాయి. దీంతో గ్రామ ప్రజలు శ్వాసకోశకు సంబంధించిన వ్యాధులతో పాటు అనేక అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్నారు. అంతేకాకుండా మూగజీవాలు వింత రోగాలతో మృత్యువాతపడుతున్నాయి. పోచారంలో రైస్‌మిల్లులు, ప్లైవుడ్, టింబర్ కంపెనీలు 30 వరకు ఉంటాయి. వీటిలో బాయిలర్ రైస్ మిల్లులే అధికంగా ఉన్నాయి. అయితే వాటినుంచి వెలువడుతున్న పొగతో వాయు కాలుష్యం ఏర్పడుతోంది. అంతేకాకుండా దుమ్మూ ధూళి ఇంట్లోని ఆహార పదార్థాలు, నీటిపై పడుతుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే పరిశ్రమల సమీపంలోని

మిగతా 8వ పేజీలో...



పోచారంలో రైస్ మిల్లులు

చర్యలు తీసుకోవాలి



పోచారంలో ఉన్న రైస్‌మిల్లులు, ప్లైవుడ్ కంపెనీల నుంచి వెలువడుతున్న దుమ్ముధూళి ఇండ్లలోని బట్టలు, వంట పాత్రలు, తాగే నీటిలో పడుతుంది. ఈ కంపెనీలపై చర్యలు తీసుకోవాలని అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు.


- సుద్దం భగీరథ, పోచారం మాజీ ఉపసర్పంచ్

ఉన్నతాధికారులు స్పందించాలి



కంపెనీలపై చర్యలు తీసుకోవాలని ప్రజాప్రతినిధులకు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులకు గతంలో అనేక సార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. కంపెనీల నుంచి వస్తున దుమ్ముధూళితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. కేన్సర్, ఊపిరితిత్తులకు సంబంధించిన రోగాలు వస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లా అధికారులు పట్టించుకొని కంపెనీలను ఇక్కడి నుంచి తరలించాలి.

- బండి రాఘురాం, ఫార్మసిస్ట్, పోచారం నివాసి





ఎర్రమట్టి తవ్వకాలను ఆపాలి


వినతి పత్రం ఇస్తున్న నాయకులు

యాలాల, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ఎర్రమట్టి అక్రమ తవ్వకాలను ఆపాలని సీపీఎం, బీఆర్ఎస్,కేవీపీఎస్ నాయకులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. బుధవారం కార్యాలయం వద్ద కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్కయ్య, సీపీఎం మండల కార్యదర్శి బుగ్గప్ప మాట్లాడుతూ.. దౌలాపూర్‌లో ఎర్రమట్టి తవ్వకాలు జరుపుతున్నారన్నారు. పదవీ విరమణ పొందిన గత తహసీల్దార్ అంజయ్య మూడు నెలల క్రితం ఇచ్చిన పర్మిషన్లతోనే తవ్వకాలు చేస్తున్నారని ఆరోపించారు. ఎర్రమట్టి తవ్వకాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. బీఆర్ఎస్ నాయకులు లక్ష్మణ్, రాజు పాల్గొన్నారు.






బీజేపీని బూత్‌స్థాయి నుంచి బలోపేతం చేద్దాం


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కెఎస్.రత్నం

షాబాద్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీని బూత్ స్థాయి నుంచి బలోపేతం చేసి, స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే, చేవెళ్ల అసెంబ్లీ ఇన్‌చార్జి కెఎస్.రత్నం అన్నారు. సర్దార్‌నగర్‌లో బుధవారం 213 పోలింగ్ బూత్ కమిటీ ఎన్నుకున్నారు. బూత్ కమిటీ కేవలం కమిటీనే కాదని, అది పార్టీకి పునాది అన్నారు. కమిటీలో ప్రతీ కార్యకర్త నిబద్ధతతో పనిచేయాలని, కేంద్ర ప్రభుత్వ పథకాలు అర్హులకు చేరేలా చూడాలన్నారు. ఎన్నికల్లో విజయంలో బూత్ కమిటీలే కీలకమన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి మహేందర్, మండల ప్రధానకార్యదర్శి హరీశ్, కోశాధికారి నారాయణ, బీజేవైఎం మండలాధ్యక్షుడు మహేశ్, విష్ణు, రాజు, నరేష్, నవీన్, శేఖర్, శివకృష్ణ, కృష్ణ, చిన్నయ్య, యాదయ్య, సందీప్, పవన్, చందు, వెంకటేశ్, శివ, సురేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

సర్టిఫికెట్ల డెలివరీలో పోస్టల్ సిబ్బంది నిర్లక్ష్యం

హైదరాబాద్ సిటీ, ఆగస్టు6(ఆంధ్రజ్యోతి):యూనివర్సిటీ సర్టిఫికెట్ల డెలివరీలో పోస్టల్ శాఖ నిర్లక్ష్యంపై బాధితుడికి రూ.50వేల పరిహారం చెల్లించాలని బుధవారం రంగారెడ్డి జిల్లా వినియోగదారుల ప్రెసిడెంట్ సీహెచ్ లతాకుమారి, సభ్యులు తీర్పునిచ్చారు. షాద్‌నగర్‌కు చెందిన సీహెచ్.రవీందర్ ఉస్మానియా యూనివర్సిటీలో లా డిగ్రీ చేశాడు. వర్సిటీ అధికారులు సర్టిఫికెట్లను స్పీడ్‌పోస్ట్‌లో పంపారు. పార్సిల్ వేరే అడ్రస్‌లో డెలివరీ చేశారు. దీంతో రవీందర్ వినియోగదారుల ఫోరాన్ని ఆశ్రయించాడు.









త్వరలో బాలికల హాస్టల్ తరలింపు


తనిఖీ నిర్వహిస్తున్న అదనపు కలెక్టర్ రాధికాగుప్తా

మేడ్చల్ టౌన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) మేడ్చల్ ఎస్సీ బాలికల హాస్టల్‌ను మండల పరిషత్ భవనాల్లోకి తరలించే పనులను మేడ్చల్‌లో జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్తా బుధవారం పర్యవేక్షించారు. మొదట బాలికల హాస్టల్‌లో తనిఖీ నిర్వహించి అక్కడ హాస్టల్ సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం మండల, జిల్లా పరిషత్ భవనాలను పరిశీలించారు. రెండు భవనాల్లో ఉన్న వసతులపై చర్చించారు. హాస్టల్ నిర్వహణ కోసం చేపట్టే ఏర్పాట్లపై తెలుసుకున్నారు. ప్రస్తుత హాస్టల్ పాతది కావటంతో తరలించేందుకు ఆదేశించారు. మండల, జిల్లా పరిషత్ భవనాల్లో ఏదో ఒక దానిలోకి త్వరలో హాస్టల్‌ను తరలించాలని సంబంధిత అధికారులను సూచించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో కాంతమ్మ, వెల్ఫేర్ అధికారి వినోద్ కుమార్ పాల్గొన్నారు.

రాజకీయంగా ఎదుర్కోలేకే ఈటలపై కుట్రలు


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ సీతారాంనాయక్

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను రాజకీయంగా ఎదుర్కోలేకనే కాంగ్రెస్ పార్టీ కుట్రలు చేస్తోందని మాజీ ఎంపీ సీతారాంనాయక్ ఆరోపించారు. అవుశాపూర్‌లో మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి నివాసంలో బుధవారం విలేకర్లతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి తప్పులను ఎత్తిచూపుతున్నందుకే కాంగ్రెస్ నాయకులు ఈటలపై బురదజల్లుతున్నారన్నారు. మేడిగడ్డ బ్యారేజి కోసం గతంలో వేసిన మంత్రివర్గ ఉపసంఘంలో నాటి సీఎం కేసీఆర్, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు సభ్యులని గుర్తుచేశారు. ప్రాజెక్టుపై బీఆర్ఎస్ అవినీతిని సీఎం రేవంత్‌రెడ్డి నిరూపించుకోలేక ఆ నెపాన్ని ఈటలపై నెడుతున్నారని అన్నారు. కేసీఆర్‌కు సొంతకొడుకు కేటీఆర్ అయితే దత్తపుత్రుడు మాత్రం రేవంత్‌రెడ్డే అన్నారు. గతంలో రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ కుటుంబ అవినీతిని వెలికితీయడం తమ లక్ష్యం అన్నారని, ఇప్పుడు మాట్లాడడం లేదన్నారు. ఇప్పటికైనా సీఎంకు చిత్తశుద్ధి ఉంటే కేసీఆర్ కుటుంబంపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అది వదిలి ఎంపీ ఈటల రాజేందర్‌ను టార్గెట్ చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో నాయకులు కొమ్మిడి మహిపాల్‌రెడ్డి, మచ్చేందర్‌రెడ్డి, విక్రంరెడ్డి పాల్గొన్నారు.

ధర్మారెడ్డి ప్యానెల్‌ను గెలిపించాలి


ధర్మారెడ్డి ప్యానెల్‌ను గెలిపించాలని కోరుతున్న సురేష్ పొద్దార్

వికారాబాద్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ ప్రభుత్వ ఉద్యోగుల కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ(మణికొండ జాగీరు) ఎన్నికల్లో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ధర్మారెడ్డి ప్యానెల్‌ను గెలిపించాలని రిటైర్డ్ జాయింట్ కలెక్టర్ సురేష్ పొద్దార్ కోరారు. ఈ నెల 10న జరిగే సొసైటీ ఎన్నికల నేపథ్యంలో బుధవారం వికారాబాద్‌లో సొసైటీ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేశారు. ధర్మారెడ్డి ప్యానెల్ సురేష్ పొద్దార్.. బి.సత్యనారాయణ(రిటైర్డ్ అదనపు రిజిస్ట్రార్), విశ్వనాథం(రిటైర్డ్ ఏసీటీవో), వేమారెడ్డి(రిటైర్డ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్)లను పరిచయం చేశారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి


చేవెళ్లలోని పాఠశాలలో సభ్యత్వం అందజేస్తున్న సంఘం నాయకులు

చేవెళ్ల, ఆగస్టు6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉపాధ్యాయులకు ప్రభుత్వం హెల్త్ కార్డులను వెంటనే అమలు చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(టీపీయుఎస్) రాష్ట్ర అధ్యక్షుడు కె.హన్మంతరావు అన్నారు. బుధవారం చేవెళ్లలోని ప్రభుత్వ పాఠశాలల్లో సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. టీచర్లకు కామన్ సర్వీస్ రూల్స్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్ బిల్లులను చెల్లించాలని కోరారు. పీఆర్సీ కాలపరిమితి తీరిందని కాబట్టి వెంటనే నూతన పీఆర్సీని అమలు చేయాలని ప్రభుత్వానికి కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కోట్ల కాశీరావు, గౌరవాధ్యక్షుడు సురధీర్, కృష్ణ, రాజశేఖర్‌రెడ్డి, వెంకటేశ్‌గౌడ్, మోర లక్ష్మణ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

● లయన్స్‌క్లబ్ జిల్లా గవర్నర్ మహేంద్రకుమార్‌రెడ్డి


గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న మహేంద్రకుమార్‌రెడ్డి

ఆమనగల్లు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి):గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ మహేంద్రకుమార్‌రెడ్డి అన్నారు. విద్యార్థి దశ నుంచే పుస్తకపఠనాన్ని అలవర్చుకోవాలని కోరారు. యాదగిరిగుట్ట జడ్పీహెచ్ఎస్‌లో లయన్స్‌క్లబ్ సభ్యుడు బిక్షపతి ఆధ్వర్యంలో 1.5లక్షలతో గ్రంథాలయం, సైన్స్ ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు. క్లబ్ సభ్యులతో కలిసి గ్రంథాలయాన్ని మహేంద్రకుమార్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. విద్యాభ్యున్నతికి లయన్స్‌క్లబ్ అనేక కార్యక్రమాలు చేపడుతోందన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ రీజియన్ చైర్మన్లు జనార్ధన్‌రెడ్డి, రఘుపతిరెడ్డి, జోన్‌చైర్మన్ లింగయ్య, లయన్స్ క్లబ్ అధ్యక్షులు గోవర్ధన్‌రెడ్డి, రాము, కార్యదర్శులు గంప శ్రీను, ప్రతాప్‌రెడ్డి, శ్రీనివాస్, సభ్యులు చంద్రశేఖర్‌రెడ్డి, రాంరెడ్డి, రామకృష్ణ, నర్సింహ, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

నేరాల అదుపునకే వాహన తనిఖీలు



ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): నేరాలను అదుపు చేయడానికే వాహన తనిఖీలు చేపడుతున్నామని మల్కాజ్‌గిరి ఏసీపీ చక్రపాణి అన్నారు. పోచారం ఐటీ కారిడార్ సీఐ రాజువర్మ, పోలీసు సిబ్బందితో కలిసి బుధవారం వెంకటాపూర్‌లో తనిఖీ చేపట్టారు.


విద్యార్థులతో జస్టిస్ షమీమ్ అక్తర్, రవిప్రసాద్ తదితరులు

విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): విద్య, ఆరోగ్యం, సంస్కృతి పరిరక్షణ రంగాల్లో వైఆర్‌పీ ఫౌండేషన్ తన సేవలందిస్తోందని ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఎలిశాల రవిప్రసాద్ అన్నారు. బుధవారం మాదాపూర్‌లోని వైష్ణవీ గ్రూప్ కార్పొరేట్ ఆఫీస్‌లో 40మంది విద్యార్థులకు రూ.9 లక్షల స్కాలర్‌షిప్‌లను రాష్ట్ర మానవ హక్కుల సంఘం చైర్మన్ జస్టిస్ షమీమ్ అక్తర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. రవిప్రసాద్ మాట్లాడుతూ.. తెలంగాణ, ఇతర ప్రాంతాల్లో చదువుతూ ఆర్థిక ఇబ్బందులతో ఉన్న ఎంబీబీఎస్, ఇంజినీరింగ్, హైస్కూల్, ప్రాథమిక విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు ఇప్పటి వరకు 350మందికిపైగా విద్యార్థులకు ఈ స్కాలర్‌షిప్ అందజేశామన్నారు. సమాజాన్ని మార్చే శక్తివంతమైన సాధనం విద్యేనన్నారు. తమ ఫౌండేషన్ ద్వారా సహాయం పొందిన విద్యార్థులు మంచి స్థానంలో ఉండాలని కోరుతున్నామని, ఇదే స్ఫూర్తితో వారు భవిష్యత్తులో సమాజానికి సాయపడాలని ఆశిస్తున్నామన్నారు. ఎప్పటి లాగే ఈసారీ పర్యావరణహిత వినాయక విగ్రహాలను పంపిణీకి నిర్ణయించామన్నారు. ఆలయాల పునరుద్ధరణ, ఉద్యోగార్థులకు ఉచిత కోచింగ్, స్టడీ మెటీరియల్ పంపిణీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఐపీఎస్ ఎం.జగదీశ్వర్, ఎలిశాల హేమచంద్ర, కృష్ణారెడ్డి, ఎం.దయాకర్, శేషగిరిరావు, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

కష్టపడి చదివితేనే ఉన్నత స్థాయి


విద్యార్థినులతో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

శంషాబాద్ రూరల్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి చదివితేనే ఉన్నత స్థాయికి ఎదుగుతారని జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. బుధవారం పాల్మాకుల కస్తూర్బా బాలికల పాఠశాలను ఆయన తహసీల్దార్ రవీందర్‌దత్‌తో కలిసి తనిఖీ చేశారు. బోధన, నీరు, ఆహారం, సౌకర్యాలు ఎలా ఉన్నాయని విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. ఇంగ్లీష్, గణితం సబ్జెక్టుల్లో బాలికలు వెనకబడి ఉండడంపై ఆందోళన వ్యక్తం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ... ఉన్నత స్థాయి చేరుకోవాలంటే కష్టపడి చదవాలని సూచించారు. ఎంతో మంది ఉన్నత చదువులు చదివినా అవకాశాలు రాక చిన్న ఉద్యోగాలు చేస్తున్నారని తెలిపారు. చదువుతో పాటు ప్రతీ అంశంలో నైపుణ్యం అవసరమని చెప్పారు. ఎస్వో, ఏఎన్ఎం, గ్రాఫ్ట్ కంప్యూటర్ ఆపరేటర్ లేరని విద్యార్థినులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. స్పందించిన ఆయన వారం రోజుల్లో వారిని నియమిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్స్‌పాల్, టీచర్లు పాల్గొన్నారు.

యార్డులో మద్యం తాగే వారిపై చర్యలు తీసుకోవాలి

- కార్యదర్శికి మార్కెట్ కమిటీ డైరెక్టర్ల సూచన

శంకర్‌పల్లి ఆగస్టు6(ఆంధ్రజ్యోతి):శంకర్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం మందుబాబులకు అడ్డాగా మారినా సిబ్బంది పట్టించుకోకపోవడం ఏమిటని డైరెక్టర్లు రవీందర్‌రెడ్డి, సర్తాజ్ కార్యదర్శి ఐశ్వర్యలక్ష్మిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శంకర్‌పల్లి మార్కెట్ కమిటీ సర్వసభ్య సమావేశం బుధవారం చైర్‌పర్సన్ గోవిందమ్మగోపాల్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. మార్కెట్ కమిటీలో నెలకొన్న సమస్యలపై డైరెక్టర్లు కార్యదర్శిని నిలదీశారు. కొందరు స్థానికులే ఆవరణలో మద్యం తాగుతూ అధ్వానంగా మారుస్తున్నారని, అడ్డుకుంటే సిబ్బందినే గదమాయిస్తున్నారని, సీసీ కెమెరాలను సైతం ధ్వంసం చేశారని కార్యదర్శి తెలిపారు. అలాంటి వారిని ఫొటోలు, వీడియోలు తీసి పోలీసులు ఫిర్యాదు చేయాలని డైరెక్టర్లు రవీందర్‌రెడ్డి, శ్రీహరి సూచించారు. బీట్ల సమయంలో మీరు కార్యాలయానికి ఎందుకు రావడం లేదని కార్యదర్శిపై మండిపడ్డారు. వ్యాపారులు, హమాలీలు ముట్టి ఎక్కువ తీస్తున్నారనే రైతులు శంకర్‌పల్లి మార్కెట్‌కు కూరగాయలు, ఉల్లిగడ్డలు ఎక్కువగా తేవడం లేదని, అధికారి పర్యవేక్షణ ఉంటే మార్కెట్ కమిటీ బాగుపడేదని డైరెక్టర్లు అన్నారు. సమావేశాలకు వ్యవసాయ అధికారి తప్పక రావాలని, రాకుంటే యార్డు ఆవరణ నుంచి వ్యవసాయ కార్యాలయాన్ని ఖాళీ చేయించాలని డైరెక్టర్లు ధ్వజమెత్తారు. మార్కెట్ ఆవరణ నుంచి చెత్త తీస్కపోకుంటే మునిసిపాలిటీకి పన్ను కట్టొద్దని డైరెక్టర్లు కార్యదర్శికి సూచించారు. చెత్తను తీసుకువెళ్లేలా మునిసిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్తానని కార్యదర్శి చెప్పారు.

దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

శామీర్‌పేట, ఆగష్టు 6(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సమస్యల దరఖాస్తులను నిర్లక్ష్యం చేయకుండా త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి మండల అధికారులను ఆదేశించారు. బుధవారం శామీర్‌పేట రెవెన్యూ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. గత నెలలో భూభారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తుల పరిష్కారంలో భాగంగా తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. రైతులు, ప్రజలు ఇచ్చిన దరఖాస్తుల్లో ఎన్ని పరిష్కరించారని తహసీల్దార్ యాదగిరిరెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఆన్‌లైన్‌లో, మ్యాన్యువల్‌గా పెండింగ్ దరఖాస్తులను పరిశీలించారు. సదస్సుల్లో వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి వేగంగా చర్యలను తీసుకోవాలని ఆదేశించారు.ఈ సందర్భంగా విజయేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. దరఖాస్తుల పరిష్కారానికి సాంకేతిక ఇబ్బందులు ఉంటే వాటిని క్లియర్ చేసుకోవాలని తహసీల్దార్‌కు సూచించారు.

బీఆర్ఎస్ జిల్లా యువజన విభాగం ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రాజీనామా



ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని ఎదులాబాద్‌కు చెందిన ఎర్రోళ్ల శ్రీనివాస్ బీఆర్ఎస్ యువజన విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు శంబిపూర్ రాజుకు పార్టీ ప్రాథమిక సభ్యత్వంతో పాటు తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు లేఖ పంపించారు. మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, రాష్ట్ర నాయకులు చామకూర భద్రారెడ్డి ఆశీస్సులతో గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకున్నామని గుర్తు చేశారు. సీఎంఆర్ ట్రస్టు నుంచి గ్రామంలో సీసీ రోడ్లు, రజక సంఘం భవనం నిర్మాణం పూర్తి చేశామన్నారు. గ్రామంలో అన్ని క్రీడలకు సంబంధించిన క్రీడాకారులకు చేయూత ఇచ్చినట్లు గుర్తుచేశారు. వ్యక్తిగత కారణాల వల్ల తాను పార్టీ సభ్యత్వానికి, పదవికి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ పార్టీలో తనకు సహకరించిన వారందరికి కృతజ్ఞతలు తెలిపారు.


క్రీడాకారులను అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలత, అధ్యాపకులు

రెజ్లింగ్‌లో సత్తాచాటిన గురుకుల క్రీడాకారులు

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తేనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని తెలంగాణ సంక్షేమ గురుకుల ఆర్మీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలత అన్నారు. అంకుశాపూర్‌లోని సంక్షేమ ఆర్మీ డిగ్రీ కళాశాల క్రీడాకారులు రెజ్లింగ్‌లో సత్తాచాటారు. ఈ నెల 2, 3 తేదీల్లో హైదరాబాద్ చంద్రాయణగుట్టలో రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో జె.హిందూజా,ఎం.ద్రాక్షావలి బంగారు పతకాలు, డి.కీర్తి, సీహెచ్.హేమ రజత పతకాలు, బి.అక్షయ, ఎస్.నవ్య కాంస్య పతకాలు సాధించారు. బుధవారం క్రీడాకారులకు సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రమాదేవి, ఫిజికల్ డైరెక్టర్ స్వప్న, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఘనంగా నీలకంఠ స్వామి కల్యాణం

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): కొర్రెములలోని మహంకాళి సమేత బ్రహ్మసూత్ర నీలకంఠస్వామి ఆలయ తృతీయ వార్షికోత్సవంలో భాగంగా బుధవారం మహంకాళి, నీలకంఠస్వామి కల్యాణాన్ని జరిపించారు. శివ పార్వతుల మంగళస్నానాల అనంతరం స్వామివారిని, అమ్మవారిని కల్యాణమండపంపై ఉంచి కల్యాణోత్సవాన్ని జరిపించారు. ఈ మహోత్సవంలో మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ మంద సంజీవరెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్, మాజీ సర్పంచ్ ఓరుగంటి కవితవెంకటేష్‌గౌడ్, కందుల రాజుశైలజ, బొడ్డు వినోదనాగార్జున్ దంపతులు, వంగూరి శివశంకర్, కొత్త రవిగౌడ్, దుర్గరాజుగౌడ్, మాటూరి రవి, ఆంజనేయులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.


నీలకంఠస్వామి కల్యాణాన్ని జరిపిస్తున్న పండితులు

తెగిన ఆదారం..

చేనేతల జీవితాలు ఆగం!

- మూలనపడిన నేత వృత్తి
- పవర్‌లూమ్, రెడీమేడ్‌ల రాకతో ఆదరణ కరువు
- ఉపాధి కోసం కుటుంబాల వలస
- ప్రభుత్వ ప్రోత్సాహం కరువు


మూలనపడ్డ చరక

నేడు జాతీయ చేనేత దినోత్సవం

తాండూరు, ఆగస్టు6(ఆంధ్రజ్యోతి): ఒక్కో పోగుతో వస్త్రాలను నేసిన చేనేత కార్మికులకు ఇప్పుడు ఆ వృత్తిలో ఉపాధి కరువైంది. నేత పరిశ్రమ గ్రామాల్లో మూతపడింది. పవర్‌లూమ్‌ల రాక, ఫ్యాక్టరీల ఉత్పత్తులతో ప్రస్తుతం చేనేత పరిశ్రమ కనుమరుగయ్యే పరిస్థితి వచ్చింది. చేనేత కార్మికులకు ప్రభుత్వ ప్రోత్సాహం కరువైంది. చేనేతలు, వృత్తిదారులతో కళకలాడిన గ్రామాల్లో నేడు మగ్గం కన్పించడం లేదు. చాలా నేత కుటుంబాలు వలసపోయాయి. గతంలో సమాజంలో ఎంతో మందికి అవసరమైన వస్త్రాలను నేత కార్మికులు రాత్రింబవళ్లు తయారు చేసేవారు. ఆర్డర్లపై చీరలు నేసేవారు. ఇదంతా 20ఏళ్ల కిందటి పరిస్థితులు. పవర్‌లూమ్‌ల రాకతో హ్యాండ్‌లూమ్‌కు ఆదరణ తగ్గింది. రెడీమేడ్ దుస్తుల వినియోగం పెరిగి చేనేతలకు పనిదొరకడం లేదు. చేనేతలంటే మగ్గం మీద నేత నేయడం, చీరలు, ఇతర వస్త్రాలు తయారు చేయడం.

గతంలో కళకళ.. నేడు వెలవెల

తాండూరు ప్రాంత యాలాల, గోవిందరావుపేట్, ముద్దాయిపేట్, ఖైల్వారంలలో చేనేత మగ్గాలుండేవి. 200 కుటుంబాలు నేత పనిపై ఆధారపడేవారు. నారాయణపేట, కోస్గిల నుంచి నూలు తెచ్చి ఇక్కడ చీరలు, వస్త్రాలు నేసేవారు. యాలాలలో చేనేత సొసైటీ ఇప్పటికీ కొనసాగుతోంది. అర్హులైన కొందరికి నేత కార్మిక పింఛన్ వస్తోంది. నూలు ధర పెరగడం, గిట్టుబాటు ధర లేక, యంత్రాల రాకతో చేనేతలకు ఆదరణతగ్గింది. చేనేతలు ఇతర పనులు చేసుకుంటున్నారు. 45ఏళ్ల వరకు వయసున్న వారిలో చాలా తక్కువ మందే చేనేత వృత్తిలోకి రాగా వారికి సైతం ఉపాధి లభించక వేరే పనుల్లో ఉన్నారు. ఇక కొత్త తరంలో ఎవరూ నేత వృత్తిలోకి రావడం లేదు. తాండూరు, యాలాలలో చేనేతలకు వస్తువులు గానీ, అవసరమైన సామగ్రి గానీ దొరకదని, హైదరాబాద్‌కు పోయి తెచ్చుకోవాలంటే ఖర్చుతో కూడుకున్న పని అని కార్మికులు వాపోతున్నారు. గతంలో ఈ ప్రాంతంలో వంద వరకు ఉన్న చేనేత కుటుంబాల్లో ప్రస్తుతం యాలాలలో 35 పద్మశాలి కుటుంబాలున్నాయి. చాలా మంది కార్మికులు నగర, పట్టణ ప్రాంతాలకు వలసపోయారు. ఇదిలా ఉంటే పదేళ్లుగా చేనేత సొసైటీలకు ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించడం లేదు. యాలాల చేనేత సహకార సంఘం నామామాత్రంగా కొనసాగుతోంది. ఈ సంఘంలో 27మంది సభ్యులున్నారు. 25ఏళ్లుగా ప్రభుత్వం నుంచి ఈ సంఘానికి ఎలాంటి సహకారం లేదు.

కార్మికులను ప్రభుత్వం ప్రోత్సహించాలి



చేనేత కార్మికులకు ప్రభుత్వ ప్రోత్సాహం అవసరం. ఏ ప్రభుత్వాలు చేనేత సంఘాలను పట్టించుకోవడం లేదు. కార్మికులు వివిధ ప్రాంతాలకు వలస వెళ్లారు. మా యాలాలలో 150 నేత కుటుంబాలుండేవి. వారిలో చాలా మంది ఊరి విడిచి వెళ్లిపోయారు. మా ఇంట్లో అమ్మ, నాన్న మగ్గం నేసేవారు. నాకు కూడా నేయడమొచ్చు. వృత్తి కార్మికులు పని లభించక ఇబ్బంది పడుతున్నారు.

- రమేశ్, ఆర్టీసీ కండక్టర్, పద్మశాలి, యాలాల

సొసైటీలకు ప్రత్యేక నిధులివ్వాలి



25ఏళ్లుగా చేనేత కార్మికులకు ప్రభుత్వం నుంచి సహకారం అందడం లేదు. పనిముట్లు లేవు. పాత పనిముట్లు పనికి రావడం లేదు. కొత్త మగ్గాలను కొనాలంటే ఆర్థిక పరిస్థితి లేదు. చేనేత కార్మికులకు సొసైటీల ద్వారా ప్రభుత్వం ఆధునిక పనిముట్లు అందించాలి. మార్కెటింగ్ కల్పించాలి. చేనేత రంగ అభివృద్ధికి ప్రభుత్వం నిధులు కేటాయించాలి.

రవీందర్, చేనేత సహకార సంఘం అధ్యక్షుడు, యాలాల

సమాచార హక్కు బోర్డు ఏర్పాటు చేయాలి

- రాష్ట్ర సమాచార హక్కు కమిషనర్ భూపాల్


తహసీల్దార్ కార్యాలయంలో సమాచార హక్కు బోర్డును పరిశీలిస్తున్న భూపాల్

కొందుర్గు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచార హక్కు బోర్డులను తప్పనిసరి ఏర్పాటు చేయాలని రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషనర్ డి.భూపాల్ సూచించారు. బుధవారం కొందుర్గు తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో సమాచార హక్కు చట్టం కేసులకు సంబంధించి 18 వేల దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా, వాటిలో 2500 పరిష్కరించినట్లు తెలిపారు. కార్యాలయంలో సిటిజన్ చార్ట్, సమాచార హక్కు కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను పక్కాగా రికార్డులో నమోదు చేయాలని తహసీల్దార్ రమేష్‌కు సూచించారు.

శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి

యాచారం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు.. పోలీసులకు సహకరించాలని, గుర్తుతెలియని వ్యక్తులు ఏమి అడిగినా ఇవ్వొద్దని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు అన్నారు. బుధవారం పిల్లిపల్లిలో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. వారితో ఆయన మాట్లాడుతూ మీకెలాంటి ఇబ్బంది వచ్చినా 100 నంబర్‌కు కాల్ చేయాలన్నారు. తాగు నీరు అడిగి మంగళసూత్రాలు అపహరించే గ్యాంగ్ తిరుగుతోందని తెలిపారు. గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. యువత, పిల్లలను గంజాయి, డ్రగ్స్‌కు దూరంగా ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమంలో హైదరాబాద్ గ్రీన్‌ఫార్మాసిటీ సీఐ సత్యనారాయణ, ఎస్సైలు సైదులు, ఎస్సైలు మధు, ప్రియాంక ఉన్నారు.

యువకుడిపై కత్తులతో దాడి

- విచారిస్తున్న పోలీసులు

బషీరాబాద్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ఓ యువకుడిని కొందరు అడ్డగించి కత్తులు, రాడ్లతో దాడిచేసిన సంఘటన బషీరాబాద్-తాండూరు రోడ్డులో గ్యాస్ గోదాం వద్ద మంగళవారం రాత్రిచోటు జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తాండూరులోని సాయిపూర్‌నకు చెందిన సయ్యద్ ఫజల్(25) మంగళవారం రాత్రి 10:30గంటలకు బైక్‌పై బషీరాబాద్ నుంచి తాండూరుకు బయల్దేరాడు. హెచ్‌పీ గ్యాస్ గోదాం వద్ద అతడిని గుర్తుతెలియని వ్యక్తులు అడ్డగించి కత్తులు, రాడ్లతో గాయపర్చారు. ఫజల్ బైక్‌తో పాటు గుంతలో పడిపోయాడు. ఫజల్‌కు ముఖం, నాలుక, శరీర భాగాలపై తీవ్ర గాయాలయ్యాయి. అతడు బషీరాబాద్‌లో ఉండే తన బంధువు అంజాద్‌కు ఫోన్ చేశాడు. అంజాద్ అక్కడికి చేరుకుని ఫజల్‌ను తాండూరు జిల్లా ఆసుపత్రికి చికిత్స తరలించాడు. దాడిపై ఫజల్ బంధువులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ నుమాన్ అలీ, సిబ్బందితో కలిసి బుధవారం విచారణ చేపట్టారు. దాడి చేసినట్టు అనుమానం ఉన్న నలుగురి పేర్లను ఫజల్ తెలిపినట్టు ఎస్ఐ చెప్పారు. అంజాద్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రజా సమస్యలు పట్టని కాంగ్రెస్ ప్రభుత్వం

మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి


చెరువు సుందరీకరణ పనులను పరిశీలిస్తున్న సబితారెడ్డి

మహేశ్వరం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రంలో ప్రజాపాలన చేస్తున్నట్టు చెప్పుకుంటున్న కాంగ్రెస్ నాయకులు కొత్తగా ఏ గ్రామానికి రోడ్డు వేశారో చూపాలని మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితాఇంద్రారెడ్డి అన్నారు. రావిర్యాల చెరువు బ్యుటిఫికేషన్ పనులను వెంటనే పూర్తి చేయాలని కోరారు. బుధవారం చెరువు పనులను ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ.. రావిర్యాల-సర్దార్‌నగర్ వరకు రోడ్డు విస్తరణకు బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.4కోట్లు విడుదల చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రద్దు చేసిందన్నారు. రావిర్యాల-సర్దార్‌నగర్ రోడ్డు మధ్యలో ఉన్న నూరంగుట్ట ఎల్లమ్మ ఆలయానికి ప్రతీ మంగళవారం వచ్చే భక్తులు రోడ్డు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తుక్కుగూడ మున్సిపల్ అధికారులతో మాట్లాడి త్వరలో ఈ రోడ్డు పనులను ప్రారంభిస్తామని తెలిపారు. ప్రభుత్వం రోడ్డు విస్తరణకు నిధులివ్వదని, మున్సిపల్ నిధులతోనైనా రోడ్డు వేయాలన్నారు. ఆలయ కమిటీ మున్సిపల్ అధికారులతో మాట్లాడాలని సూచించారు. అభివృద్ధి చేతకాని కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్‌పై నిందలు వేసేందుకే సరిపోతున్నారన్నారు. ఎన్నికల్లోనే రాజకీయాలు చేయాలని, అభివృద్ధి విషయంలో అంతా కలిసే పనిచేయాలని కాంగ్రెస్ నాయకులను ఉద్దేశించి విమర్శించారు. కార్యక్రమంలో ఎల్లమ్మ ఆలయ కమిటీ చైర్మన్ రెడ్డిగల్ల రత్నం, బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు లక్ష్మయ్య, సుమన్, సామేల్ రాజు, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మృతుడి ఆచూకీ కోసం విస్తృత ప్రచారం

- సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేస్తున్న పోలీసులు
- సిలిండర్ పేలుడు ఘటనతో నష్టపోయిన వారిని ఆదుకోవాలని స్థానికుల డిమాండ్


సిలిండర్ పేలిన ఘటనలో మృతిచెందిన యువకుడు

మేడ్చల్ టౌన్, ఆగస్టు6(ఆంధ్రజ్యోతి): మేడ్చల్ మార్కెట్‌లో ఎల్పీజీ సిలిండర్ పేలిన ఘటనలో మృతి చెందిన వ్యక్తి ఆచూకీ కోసం పోలీసులు ప్రచారం చేస్తున్నారు. మృతుడి ఫొటోను సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేస్తూ, పారిశ్రామికవాడలో, పట్టణంలోని లేబర్ అడ్డాల వద్ద ఆరా తీస్తున్నారు. రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిపై గోడ శిథిలాలు పడి చనిపోయిన ఘటన జరిగి మూడు రోజులైనా మృతుడెవరో తేలలేదు. మృత దేహాన్ని ముషీరాబాద్‌లోని గాంధీఆస్పత్రి మార్చురీలో భద్రపరిచారు. కాగా చనిపోయిన వ్యక్తి వేరే రాష్ట్రం నుంచి వలసొచ్చినవాడై ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఆధారాల సేకరణకు సీసీ టీవీల ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. మృతుడు 25ఏళ్ల వయసుంటాడని భావిస్తున్నారు. ఫొటోచూసి గుర్తుపట్టిన వారు పోలీసులకు సమాచారమివ్వాలని మేడ్చల్ సీఐ సత్యనారాయణ కోరారు. కాగా మృతుడి ఆచూకీ గుర్తింపునకు అతడి ఫొటోను స్థానికులు సైతం సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో వైరల్ చేస్తున్నారు.

బాధితులను ఆదుకోవాలి

ఘటనలో మృతుడి ఆచూకీ తెలుసుకోవడంతో పాటు పేలుడుతో ఆస్తినష్టం వాటిల్లిన వారికీ ప్రభుత్వం ఆర్థికసాయం అందజేయాలని స్థానికులు కోరుతున్నారు. దినేష్ అనే వ్యక్తి మొబైల్ దుకాణం ధ్వంసమైంది. తనకు రూ.8లక్షల నష్టం వాటిల్లిందని అతడు తెలిపాడు. మరో మొబైల్ దుకాణం సైతం ధ్వంసమైంది. అధికారులు ఇప్పటి వరకు నష్టంపై దర్యాప్తు చేయలేదని, బాధితుల వివరాలు నమోదు చేసుకోలేదని చెబుతున్నారు. కాగా ఈ ఘటనలో ధ్వంసమైన పాత ఇంటి యజమానులు శిథిలాల తొలగింపునకు మునిసిపల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. నష్టపోయిన వ్యాపారులకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందించాలని కోరుతున్నారు. ఈ విషయమై తహసీల్దార్ స్పందన కోరగా.. సిలిండర్ పేలిన ఘటనలో నష్టపోయిన వారు పూర్తి వివరాలతో దరఖాస్తు చేసుకుంటే తాము ప్రభుత్వానికి ప్రతిపాదన పంపుతామని తెలిపారు.

గ్రంథాలయాల అభివృద్ధికి పన్నులు తప్పనిసరి

వికారాబాద్, ఆగస్టు6(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలను అభివృద్ధిపరిచేందుకు పంచాయతీలు, మున్సిపాలిటీలు గ్రంథాలయ పన్నులను తప్పక చెల్లించాలని అదనపు కలెక్టర్ ఎం.సుధీర్ ఆదేశించారు. బుధవారం గ్రంథాలయ పన్ను వసూలు కమిటీతో అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) సమీక్ష నిర్వహించారు. గ్రంథాలయాలకు ఆదాయ వనరు పన్ను మాత్రమేనని, పన్నుల వసూలైతేనే సౌకర్యాల కల్పన సాధ్యం అన్నారు. మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలు చెల్లించాల్సిన లైబ్రరీ సెస్సును చెల్లించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

బీఎల్‌ఏల నియామకానికి శ్రద్ధ తీసుకోవాలి

వికారాబాద్ జిల్లాలో పోలింగ్ కేంద్రాలకు ప్రతీ పార్టీ నుంచి బూత్‌స్థాయి అసిస్టెంట్ల నియామకానికి శ్రద్ధ తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్ రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. బుధవారం తన చాంబరులో నిర్వహించిన సమావేశంలో పోలింగ్‌స్టేషన్ల హేతుబద్ధీకరణ, కొత్త పీఎస్‌ల ఏర్పాటు, భవనాల గుర్తింపుపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో చర్చించారు. బీఎల్‌ఏల నియామకానికి పార్టీలు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. జిల్లాలో 284 పోలింగ్ కేంద్రాలున్నాయని, ప్రతీ కేంద్రానికి బూత్ స్థాయి అసిస్టెంట్లను నియమించి వివరాలను అప్లోడ్ చేయాలన్నారు. బీఎల్‌వోల, బీఎల్‌ఏలు సమన్వయంతో జాబితాలో మార్పులు, చేర్పులు చేయాలని పేర్కొన్నారు. సమావేశంలో తహసీల్దార్ లక్ష్మీనారాయణ, డీటీ అనిత, ప్రతినిధులు పాల్గొన్నారు.

సదుపాయాలు ఎన్నేళ్లకు కల్పిస్తారు?

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారుల ఆందోళన


డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల వద్ద ఆందోళన చేస్తున్న లబ్ధిదారులు

శామీర్‌పేట, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కేటాయించి రెండేళ్లనా సదుపాయాలను కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని, ఇంకా ఎన్నేళ్లకు కల్పిస్తారని లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేశారు. అలియాబాద్ మునిసిపల్ పరిధి మురహరిపల్లిలో రెండేళ్ల క్రితం ప్రభుత్వం 2,346 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను అపార్ట్‌మెంట్లుగా నిర్మించింది. రెండేళ్ల కింద లబ్ధిదారులకు కేటాయించింది. హైదరాబాద్ పరిధి ముషీరాబాద్, సికింద్రాబాద్ నియోజకవర్గాలకు చెందిన 2,238 మందికి 2023 అక్టోబరులో ఫ్లాట్లను కేటాయించింది. 108 డబుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్లను స్థానిక పేదలకు ఇచ్చేందుకు ఖాళీగా ఉంచింది. అయితే రెండేళ్లు గడుస్తున్నా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు నీరు, విద్యుత్, లిఫ్ట్ వంటి సౌకర్యాలను కల్పించలేదు. దీంతో లబ్ధిదారులు వాటిల్లో ఉండడం లేదు. వాడుకలో లేని ఫ్లాట్లు శిథిలం అవుతాయేమోనని, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతాయేమోనని లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం 50మంది లబ్ధిదారులు అపార్ట్‌మెంట్ల వద్ద ఆందోళన చేశారు. డిసెంబర్ నుంచి అధికారులను కలిసి విద్యుత్, నీరు, లిఫ్ట్ సౌకర్యాలను కల్పించాలని కోరినా పట్టించుకోవడం లేదన్నారు. కాంట్రాక్టర్, అధికారులు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలోకి తమను వెళ్లనీయడం లేదన్నారు. రెండేళ్లుగా ఫ్లాట్లు వృథాగా ఉన్నాయని, తాము ఇళ్ల కిరాయిలు కట్టుకుంటూ ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే ఫ్లాట్లను ప్రారంభించాలని కోరుతున్నారు.

ప్రభుత్వ స్థలం ఆక్రమణకు యత్నం

● కమిషనర్‌కు స్థానికుల ఫిర్యాదు


వినతిపత్రం ఇస్తున్న చింతపల్లిగూడ వాసులు

ఆదిభట్ల, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఆదిభట్ల మున్సిపల్ పరిధి చింతపల్లిగూడ 3వ వార్డులో ప్రజా అవసరాల కొరకు ఉన్న స్థలాన్ని ఓ వ్యక్తి ఆక్రమించేందుకు యత్నిస్తున్నాడని స్థానిక ప్రజలు మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణకు బుధవారం ఫిర్యాదు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం జోగు స్వామి ఇంటి పక్కన ఉన్న ప్రభుత్వ స్థలాన్ని అతడు ఆక్రమించేందుకు పాల్పడుతున్నాడని కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఈ స్థలంలోనే చేతిపంపు, మినీ వాటర్ ట్యాంకు, బొడ్రాయి ఉందన్నారు. దసరా రోజు జెండా ఎగరవేసే దిమ్మె సైతం ఇక్కడే ఉందని తెలిపారు. స్వామి స్థలాన్ని ఆక్రమించేందుకు లెట్రిన్ గుంతలు తవ్వాడని పేర్కొన్నారు. ఆయనపై చర్యలు తీసుకొని ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని కమిషనర్‌ను కోరినట్లు తెలిపారు. జోగు శేఖర్, రమేష్, ఉక్కుల అశోక్, నర్సింహ, సంజీవ, గణేష్, శివకుమార్, అర్జున్ తదితరులున్నారు.

(ఐదో పేజీ తరువాయి)

రావడం లేదంటున్నారు. పచ్చిమిర్చి, బీన్స్, గోకర కాయ ధరలు చికెన్‌తో పోటీ పడుతున్నాయి. వాస్తవానికి టమోటా లేని కూర ఉండదనే చెప్పారు. కూరల్లో ఉల్లికి ఎంత ప్రాధాన్యత ఉంటుందో టమాటకు అంతే ఉంటుంది. అలాగే టమాట ధర ఆకాశానికి నిచ్చెనవేసింది. అల్లంవెల్లుల్లి రేట్లూ భగ్గుమంటున్నాయి. కేజీ అల్లం రూ.120, వెల్లుల్లి రూ.160కు విక్రయిస్తున్నారు.

ఏటేటా తగ్గుతున్న సాగు..

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో కూరగాయల సాగు ఏటేటా తగ్గుతోంది. దీనికి రియల్ ఎస్టేట్ ప్రభావంతో పాటు కూరగాయల సాగులో రైతులకు ప్రోత్సాహం కరువైంది. రాయితీలు కల్పించక పోవడం తదితర కారణాలతో సాగు విస్తీర్ణం తగ్గుతోంది. ఒకప్పుడు రంగారెడ్డి జిల్లాలోనే ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్‌కు సరిపోను కూరగాయలు ఉత్పత్తి అయ్యేవి. 2021-22 సంవత్సరంలో 33,363 ఎకరాల్లో కూరగాయల సాగు చేయగా 3,08,460 మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చింది. గత ఏడాది వరకు 29,249 ఎకరాల్లో కూరగాయల పంటలు సాగు చేశారు. ఈమేరకు 2,76,281 మెట్రిక్ టన్నులు దిగుబడి సాధించారు. జిల్లాలో ఎక్కువగా యాచారం, ఇబ్రహీంపట్నం, కందుకూరు, మంచాల, అబ్దుల్లాపూర్‌మెట్, మాడ్గుల, చేవెళ్ల, శంకర్‌పల్లి, మొయినాబాద్, కడ్తాల, ఆమనగల్లు, షాద్‌నగర్, కొందుర్గు తదితర మండలాల్లో కూరగాయలు, ఆకుకూరలు పండిస్తున్నారు. జిల్లాలో ఆశించిన మేర కూరగాయల ఉత్పత్తి లేకపోవడంతో ఇతర రాష్ట్రాల నుంచి కూరగాయలు దిగుమతి చేసుకుంటున్నారు. దీంతో ధరలు రోజురోజుకూ పెరుగుతున్నాయి.

కొనలేం.. తినలేం!

అరకిలోతో సరిపెట్టుకోవాల్సి వస్తుంది



ఒకప్పుడు రూ.200 మార్కెట్‌తో తీసుకెళ్తే సంచి నిండా కూరగాయలు వచ్చేవి. ఇప్పుడు రూ.500 తీసుకెళ్లినా నాలుగు రకాలు రావడం లేదు. కిలో తీసుకుకోవాల్సినవి అరకిలోతోనే సరిపెట్టుకోవాల్సి వస్తుంది. 15 రోజుల క్రితం కిలో టమాట ధర రూ.30 ఉంటే.. ఇప్పుడు ఏకంగా రూ.50కి చేరుకుంది. అల్లంవెల్లుల్లి, పచ్చిమిర్చి ధరలైతే ఆకాశాన్నంటాయి.

- బంగారు మాణమ్మ, తుమ్మలపల్లి, జిల్లేడు చౌదర్‌గూడ మండలం

(ఐదో పేజీ తరువాయి)

కమ్మేస్తున్న కాలుష్యం



పంటలు ఎదగకపోవడంతో దిగుబడి తగ్గుతోందని రైతులు వాపోతున్నారు. సమస్యను స్థానిక ప్రజాప్రతినిధులకు, అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా స్పందించకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పరిశ్రమలను పర్యవేక్షించాల్సిన పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులతో పాటు మండలస్థాయి ఉన్నతాధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఆందోళనలో గ్రామస్తులు

పోచారం గ్రామ సమీపంలోని కంపెనీల నుంచి వెలువడుతున్న వ్యర్థ జలాలతో భూగర్భ జలాలు సైతం కలుషితమవుతున్నాయని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బోరు బావుల నుంచి కలుషిత నీరు రావడంతో పంటలు ఎండిపోతున్నాయని, అవి తాగి జీవాలు రోగాల బారిన పడి చనిపోతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. రైస్‌మిల్లుల నుంచి రాత్రి సమయంలో వెలువడే పొగను పీల్చడం ద్వారా శ్వాసకోశ, కేన్సర్ రోగాల బారిన పడి పోచారం గ్రామంలో పది మంది వరకు చనిపోయిన ఘటనలున్నాయి. కంపెనీలకు చెందిన భారీ వాహనాలు రోడ్డుపై నిలుపడంతో వారం రోజుల క్రితం ఓ యువకుడు బైక్‌తో లారీని ఢీకొనడంతో తీవ్ర గాయాల పాలయ్యాడు. కోలాన్‌గూడకు చెందిన హోంగార్డు బైక్‌ను ధ్యానం లోడ్‌తో వచ్చే లారీ ఢీకొనడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. భారీ వాహనాలు రోడ్డుపై పార్కింగ్ చేస్తుండటంతో నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. కంపెనీలను ఇక్కడి నుండి తరలించాలని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, ఉన్నత అధికారులకు ప్రజలు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. దీనిని సాకుగా తీసుకొని రాజకీయ నాయకులు కంపెనీల యజమానులతో ఆర్థిక ఒప్పందాలు చేసుకుంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

మల్కపహాడ్‌వాసి రమేష్ రాథోడ్‌కు డాక్టరేట్


ప్రొ.లక్ష్మణ్ నాయక్ నుంచి పట్టా అందుకుంటున్న రమేష్ రాథోడ్

చౌదరిగూడ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లేడ్ చౌదరిగూడ మండలం మల్కపహాడ్ తండాకు చెందిన రమేష్ రాథోడ్ పీహెచ్‌డీ పూర్తిచేసి డాక్టరేట్ పొందారు. దేవులతండాకు చెందిన మాజీ ఎంపీటీసీ అమ్రమ్మ, గోబ్ర్యానాయక్‌ల కుమారుడు, వృత్తిరీత్యా ఉపాధ్యాయుడైన రమేష్ రాథోడ్ ప్రొ. లక్ష్మణ్ నా యక్ నుంచి బుధవారం డాక్టరేట్ అందుకున్నారు. ఉస్మానియా యూనివర్సిటీ లో భౌతికశాస్త్ర విభాగంలో 'కంపారిటీవ్ స్టడీస్ ఆన్ స్ట్రక్చరల్ ఆప్టికల్ ఎలక్ట్రిక ల్ అండ్ మ్యాగ్నటిక్ ప్రాపర్టీస్ ఆఫ్ రేర్ ఎర్త్ మెటల్ అయాన్స్ డోపుడ్ కాపర్, మెగ్నీషియం నానో స్పినల్ ఫెరైడ్స్ జైలో టెంపరేచర్ సిట్రెస్ సాల్‌జెల్ ఆ టోకంబుషన్ మెథడ్ అంశంపై పరిశోధన చేశాడు. పలువురు గిరిజన నాయకులు, ఉపాధ్యాయులు, అధ్యాపక బృందం ఆయన్ను అభినందించారు.

జయశంకర్ సార్‌కు ఘన నివాళి

తెలంగాణ స్వరాష్ట్ర సాధన కోసం చివరి శ్వాస వరకూ పోరాడిన ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన విగ్రహాలు, చిత్రపటాల వద్ద ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొని పార్టీలకు అతీతంగా ఘన నివాళి అర్పించారు. అదేవిధంగా కళాశాలలు, పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు సార్ చిత్రపటాల వద్ద నివాళులర్పించారు.


చేవెళ్ల : జయశంకర్ సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు


కొందుర్గు : జయంతి వేడుకల్లో బీఆర్ఎస్ నాయకులు


కేశంపేట : నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు


కడ్తాల : జయశంకర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు


షాద్‌నగర్ అర్బన్ : నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, నాయకులు


రోడ్డు పనులను ప్రారంభిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి స్వాతిరెడ్డి

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

షాద్‌నగర్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ కోర్టు సముదాయంలో సీసీ రోడ్డు నిర్మాణం పనులు ప్రారంభమయ్యాయి. బుధవారం కోర్టు సీనియర్ సివిల్ జడ్జి స్వాతిరెడ్డి పనులను ప్రారంభించారు. అనంతరం షాద్‌నగర్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వేణుగోపాల్ రావు మాట్లాడుతూ కోర్టు ఆవరణలో సీసీ రోడ్డు లేకపోవడం వల్ల కక్షిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్న విషయాన్ని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దృష్టికి తీసుకువెళ్లామని చెప్పారు. ఆయన వెంటనే స్పందించి సీసీ రోడ్డు నిర్మాణం పనులకు గాను పట్టణ మున్సిపాలిటీ నుంచి నిధులు మంజూరు చేయించడంతో పాటు, కోర్టులో బహుళ అంతస్తుల భవన నిర్మాణం కోసం రూ.8 కోట్లు మంజూరు చేయించారని చెప్పారు. ఈసందర్భంగా ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి కొత్త రవితో పాటు బార్ అసోసియేషన్ ప్రతినిధులు, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

శిశువుకు తల్లిపాలు తప్పక పట్టించాలి

మహేశ్వరం/కొత్తూర్/కేశంపేట, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): శిశువుకు తల్లి పాలు ఆహారమే కాదు అమృతంతో సమానమని, పుట్టిన గంటలోనే పిల్లలకు తప్పక పాలు పట్టించాలని మహేశ్వరం సీడీపీవో శాంతిశ్రీ అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలో గర్భిణులు, బాలింతలతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. తల్లి పాల ప్రాముఖ్యతకు అధిక ప్రాధాన్యతనివ్వాలన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు. కొత్తూర్ మున్సిపాలిటీ తిమ్మాపూర్‌లో ఐసీడీఎస్, జిమ్స్ హోమియోపతిక్ మెడికల్ కళాశాల ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవం నిర్వహించారు. వైద్యులు మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, శిశువులకు తల్లి పాలు, పౌష్టికాహారం చాలా కీలకమన్నారు. కొత్తూర్ పీహెచ్‌సీ డాక్టర్ రాజేష్ బాబు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేవతి, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లున్నారు. తల్లి పాలతో బిడ్డ ఆరోగ్యంగా ఎదుగుతుందని ఐసీడీఎస్ కొత్తపేట సెక్టార్ సూపర్‌వైజర్ శమంతకమణి అన్నారు. కేశంపేట మండలం ఎక్లాస్‌ఖాన్‌పేట అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు.

గ్రామ స్వరాజ్యం బీజేపీతోనే సాధ్యం


మంచాల : కేంద్ర పథకాలపై వివరిస్తున్న లచ్చిరెడ్డి నాయకులు

మంచాల, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): గ్రామ స్వరాజ్యం బీజేపీతోనే సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు జి.లచ్చిరెడ్డి అన్నాడు. బీజేపీ చేపట్టిన మహాసంపర్క్ అభియాన్‌లో భాగంగా కేంద్ర సంక్షేమ పథకాలపై బుధవారం మంచాలలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీజేపీ మండలాధ్యక్షుడు నూకం రాజు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు వెంకట్‌రెడ్డి, జిల్లా నాయకుడు దన్నెబాషయ్య, మారమోని శ్రీశైలం, పాండాల జంగయ్య, మెండు వెంకట్ రెడ్డి, సందీప్, బిక్షపతి, ఐలయ్య, పూర్ణచందర్, రాజమల్లేష్, శేఖర్‌గౌడ్, రావుల పవన్, వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత విద్యుత్ ఏమైంది?

యాచారం : తాము అధికారంలోకి వస్తే రైతులకు 24గంటల పాటు త్రీఫేజ్ ఉచిత విద్యుత్ అందిస్తామని గొప్పలు చెప్పిన కాంగ్రెస్ నాయకులు నేడు విద్యుత్ అందడం లేదని తెలిసి ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యుడు బోసుపల్లి ప్రతాప్ అన్నారు. నజ్దిక్ సింగారంలో ఇల్లిల్లూ తిరిగి కేంద్ర పథకాలను ప్రజలకు వివరించారు. 24 గంటల పాటు రైతులకు త్రీఫేజ్ విద్యుత్ అందించాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యల పరిష్కారం పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. సాగర్-హైదరాబాద్ ప్రధాన రహదారిని నాలుగులేన్లుగా విస్తరించాలన్నారు. మండలాధ్యక్షుడు విజయ్‌నాయక్, మాజీ అధ్యక్షుడు రవీందర్, బీజేవైఎం నియోజకవర్గ కన్వీనర్ రవీందర్‌రెడ్డి, నాగటి యాదయ్య, దేవరకొండ ఈశ్వర్ తదితరులున్నారు.

గద్దర్ ఆశయ సాధనకు కృషి చేయాలి


నివాళులర్పిస్తున్న లక్ష్మణశర్మ, పాపిశెట్టి రాము

ఆమనగల్లు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను తన గళం ద్వారా ఎలుగెత్తి, అణగారిన వర్గాల అభ్యున్నతికి జీవితాంతం పరితపించిన గద్దర్ గొప్ప మహనీయుడని గద్దర్ విగ్రహ నిర్మాణ కమిటీ కన్వీనర్ లక్ష్మణ శర్మ, సంఘ సేవకుడు పాపిశెట్టి రాము అన్నారు. ఆమనగల్లు పట్టణంలో బుధవారం గద్దర్ విగ్రహ నిర్మాణ కమిటీ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో గద్దర్ 2వ వర్ధంతిని నిర్వహించారు. పలు పార్టీల నేతలు, కళాకారులు, యువకులు, ప్రజాసంఘాల నేతలు పాల్గొన్నారు. గద్దర్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కవి జక్క గోపాల్, నాయకులు భిక్షపతి, బొజ్జన్న, సుధాకర్, రజిత, తదితరులున్నారు.

కడ్తాల్ : మండల కేంద్రంలో గద్దర్ వర్ధంతి నిర్వహించారు. డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి గద్దర్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. జహంగీర్‌అలీ, జంగయ్య, పాషా, కృష్ణయ్య, మహేందర్, శంకర్, మల్లయ్య, తదితరులున్నారు.

కురిసిన వర్షం.. నిలిచిన నీరు

చౌదరిగూడ, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాగులు పొంగిపొర్లుతున్నాయి. చెరువులు నిండుకుంటున్నాయి. బుధవారం సాయంత్రం జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో కురిసిన వర్షానికి పంట పొలాల్లోకి భారీగా నీరుచేరింది. వర్షపు నీటితో కొంతమేర పంటలు నష్టపోయే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఎస్సీ వసతి గృహాలు నిర్మించాలి

చేవెళ్ల, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : చేవెళ్ల పట్టణ కేంద్రంలో ఎస్సీ బాలుర, బాలికల వసతి గృహాలను నిర్మించాలని ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాస్, అరుణ్ కుమార్ డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చేవెళ్ల పట్టణ కేంద్రంలో ఎస్సీ బాలుర, బాలికల నూతన వసతి గృహాలు నిర్మించాలని డిమాండ్ చేస్తూ పట్టణ కేంద్రంలో ర్యాలీ నిర్వహించి చేవెళ్ల ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేసి ఆర్డీవో చంద్రకళకు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ 2018లో చేవెళ్లకు ఎస్సీ బాలికల, బాలుర కళాశాల హాస్టళ్లు మంజూరయ్యాయని, అప్పటి నుంచి ఇప్పటి వరకు అద్దె భవనంలో కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా వసతి గృహాలు నిర్మించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

సంక్షిప్తంగా..

కడ్తాల్ : మండలానికి లైసెన్స్‌డ్ సర్వేయర్లను 15 మందిని ట్రైనింగ్ కోసం అసిస్టెంట్ డైరెక్టర్ సర్వే అండ్ ల్యాండ్ రికార్ట్స్ ఉత్తర్వులు జారీ చేశారు. బుధవారం నుంచి 40 రోజుల పాటు ట్రైనింగ్ కోసం నియమించడం జరిగిందని తెలిపారు.

కడ్తాల్ : పట్టణాలకు సమాంతరంగా గ్రామాలను అభివృద్ధి చేసి ప్రజలకు మెరుగైన మౌలిక వసతుల కల్పించాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఎమ్మెల్యే నారాయణరెడ్డి సహకారంతో రూ.2 కోట్ల 50 లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను బుధవారం శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. క్యామ రాజేశ్, నాయకులు ప్రవీణ్‌గౌడ్, సందీప్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆమనగల్లు : జంగారెడ్డిపల్లి నుంచి మాడ్గుల మండలం చంద్రాయన్‌పల్లి వరకు బీటీ రోడ్డు నరకప్రాయంగా మారింది. వర్షాలకు అడుగడుగునా బీటీ కొట్టుకుపోయి గోతులేర్పడ్డాయి. పాడైన రోడ్డుపై తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. స్పందించిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కల్లు విక్రమ్‌రెడ్డి సొంత డబ్బు వెచ్చించి బుధవారం రోడ్డుపై మొరం పోసి చదును చేయించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు జగన్, కృష్ణనాయక్, తదితరులు ఉన్నారు.

శంషాబాద్ రూరల్ : సౌత్ ఏషియన్ హజ్ డివిజన్ ద్వారా ఉత్తమ సర్వీసెస్ అవార్డును శంషాబాద్‌లోని ఆల్ మీజాన్ హజ్, ఉమ్రా సర్వీసు యజమాని హఫీజ్ మొహ్మద్ ఫయాజ్ అలీ అవార్డును అందుకున్నారు. మక్కా మదీనాలో ఇస్లామిక్ మతపెద్దలు ఫయాజ్ అలీని సన్మానించి అభినందనలు తెలిపారు. ఉస్మాన్ బిన్ షైఫూజ్, తదితరులు పాల్గొన్నారు.

శంషాబాద్ : సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అయోధ్య రోడ్డు ప్రమాదంలో మృతిచెందడం పార్టీకి తీరని లోటని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య అన్నారు. రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన అయోధ్య చిత్రపటాన్ని శంషాబాద్ అంబేడ్కర్ చౌరస్తాలో ఏర్పాటుచేసి నాయకులతో కలిసి పూలమాలలు వేసి సంతాపం తెలిపారు. సీపీఐ నాయకులు పుస్తకాల నర్సింగ్‌రావు, పానుగంటి పర్వతాలు, ఓరుగంటి యాదయ్యపల్నాటి యాదయ్య, నర్రాగిరి, తదితరులు పాల్గొన్నారు.

కందుకూరు : మధ్యాహ్న భోజనాన్ని వండుతున్న కార్మికులకు కనీస వేతన చట్టాన్ని అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీఐటీయు మండల కన్వీనర్ బుట్టి బాల్‌రాజ్ అన్నారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాలంటూ నగరంలోని మధ్యాహ్న భోజన కమిషనరేట్ ముట్టడికి మండల కేంద్రం నుంచి కార్మికులు తరలివెల్లారు. మండల శాఖ అధ్యక్షుడు కె.శ్రీనివాస్, ప్రభావతి, లక్ష్మమ్మ, విజయమ్మ, లావణ్య, శోభ, అలివేలు, తదితరులు ఉన్నారు.

చౌదరిగూడ : ఉమ్మడి కొందుర్గు మండలంలో ట్రైనీ సర్వేయర్లు కొందుర్గు మండల తహసీల్దార్ రమేష్ కుమార్, జిల్లేడ్ చౌదరిగూడ డీటీ భాస్కర్ సమక్షంలో విధుల్లో చేరారు. ఈసందర్భంగా వారు ట్రైనీ సర్వేయర్లకు పలు సూచనలు చేశారు. ఆర్ఐ శ్రీనివాస్‌రెడ్డి, సర్వేయర్ అంజనేయులు ఉన్నారు.

షాద్‌నగర్ అర్బన్ : షాద్‌నగర్ శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించతలపెట్టిన మహాకుంభ సంప్రోక్షణ కార్యక్రమానికి స్థానిక రిటైర్డు ఉద్యోగి మధుసూదనాచారి రూ.లక్ష విరాళం ఇచ్చారు. ఆలయ ఆవరణలో మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు ఆధ్వర్యంలో చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి పర్యవేక్షలు ఒగ్గ కిషోర్, కానుగు రాంబూపాల్, గందం ఆనంద్, ఆలయ ప్రధాన పూజారి శ్రీనివాసచార్యులు, లయన్ శివ నాగయ్య పాల్గొన్నారు.

కొత్తూర్ : పెంజర్ల ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థులకు ఉపాధ్యాయుల బృందం అభినందనలు తెలయజేసింది. సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఇటీవల నిర్వహించిన సబ్‌జూనియర్ జావెలిన్‌త్రో జిల్లాస్థాయి విభాగంలో పాఠశాలకు చెందిన షేక్ జకి(8వ తరగతి), జి.చిత్ర(7వ తరగతి), నందిని (8వ తరగతి) ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. త్వరలో జనగాంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పీడీ మోనాలిసా తెలిపారు. ఈమేరకు హెచ్ఎం ప్రసన్నలక్ష్మి, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

షాద్‌నగర్ : లోఓల్టేజీ సమస్యలను నివారించేందుకు విద్యుత్ శాఖ అధికారులు మూడు ట్రాన్స్ ఫార్మర్‌లను మంజూరు చేశారు. ఫరూఖ్‌నగర్ మండలం కిషన్‌నగర్‌లో రైతులు లోఓల్టేజీ సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమాచారం తెలియడంతో అధికారులు షాద్‌నగర్ విద్యుత్ అధికారులు ఎస్ఈ రామ్మోహన్, డీఈ శ్యాంసుందర్‌రెడ్డి, రూరల్ ఏఈ షణ్ముఖరెడ్డిలు మూడు ట్రాన్స్‌ఫార్మర్‌లను మంజూరు చేశారు. దాంతో రైతులు కరెంట్ సమస్య తీర్చినందుకు అధికారులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

షాబాద్ : నాగర్‌గూడలో మైసమ్మ, పోచమ్మ బోనాలు ఘనంగా జరుపుకున్నారు. శోభాయాత్రను తలపించేలా ఊరేగింపు నిర్వహించారు. అమ్మవారి ఆలయాలు అందంగా ముస్తాబు చేశారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి గ్రామస్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

కేశంపేట : లింగంధనకు చెందిన ముత్యాల రాములు అనారోగ్యానికి గురై చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దృష్టికి తీసుకపోగా.. స్పందించిన ఎమ్మెల్యే సీఎం సహాయ నిధి నుంచి లెటర్ ఆఫ్ క్రెడిట్(ఎల్‌వోసీ)ని మంజూరు చేయించారు. మంజూరైన ఎల్‌వోసీని కాంగ్రెస్ నాయకులు బుధవారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

క్రైం కార్నర్

భార్యాభర్తలపై కత్తితో దాడి

● పశువుల మేత విషయంలో ఇద్దరి మధ్య గొడవ

మొయినాబాద్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): పశువుల మేత విషయంలో ఇద్దరు వ్యక్తులు గొడవపడగా.. అందులో ఓ వ్యక్తి మరో వ్యక్తిపై కత్తితో దాడి చేశాడు. ఈ సంఘటన మొయినాబాద్‌లో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మొయినాబాద్‌కు చెందిన ఎండీ హఫీజ్, ఎండీ వాజీద్ కుటుంబాలు ముర్తుజగూడ రెవెన్యూలోని షమ్స్ కాలనీలో నివాసముంటున్నాయి. అయితే, వారికి మేకలు, గేదెలు, ఆవులు ఉన్నాయి. ఆ కాలనీలోని ఖాళీ స్థలాల్లో హఫీజ్ పశులను మేపుతుంటాడు. బుధవారం అదే స్థలంలో వాజిద్ తన పశువులను మేతకోసం తీసుకెళ్లాడు. దాంతో తాను ఎప్పటినుంచో ఆ స్థలంలో మేపుతున్నాను.. నీ పశువులను ఎందుకు తీసుకొచ్చావని హఫీజ్ వాజిద్‌తో గొడవపడ్డాడు. మాటామాట పెరిగింది. ఈక్రమంలో హఫీజ్ కుమారుడు ఇంట్లోంచి కత్తి తెచ్చి ఇవ్వగా అతడు వాజిద్‌తో పాటు అతని భార్య రఫియాపై దాడి చేశాడు. ఇద్దరికీ తీవ్ర గాయాలు కాగా ఆసుపత్రికి తరలించారు. వాజిద్ సోదరుడు షాజిద్‌కు విషయం తెలియడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసుల తెలిపారు.

వృద్ధురాలిని మోసం చేసి బంగారు గుండ్లహారం అపహరణ

● మాయమాటలతో

నకిలీ పుస్తెలతాడు అప్పజెప్పిన వైనం

తలకొండపల్లి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): వృద్ధురాలిని మోసం చేసి తొమ్మిది గ్రాముల బంగారు గుండ్ల దండను తీసుకొని మోసగించిన సంఘటన తలకొండపల్లి మండలం వెల్జాలలో చోటుచేసుకుంది. తలకొండపల్లి ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల మేరకు.. తలకొండపల్లి మండలం వెల్జాలకు చెందిన రాచమల్ల మల్లమ్మ జూలై 30న గ్రామంలో గల సాయి బాబా ఆలయం వద్ద కూర్చొని ఉండగా గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు (ఆడ, మగ) వచ్చి మాది ఆవంచ గ్రామమని.. మేము మీకు బంధువులము అవుతామని మాటలు కలిపారు. ఈక్రమంలో వృద్ధురాలి మెడలో ఉన్న తొమ్మిది గ్రాముల బంగారు గుండ్ల హారాన్ని చూసి అపహరించాలన్న ఉద్దేశంతో మాయ యాటలు చెప్పి మాటల్లో దింపారు. తమ వద్ద ఉన్న నకిలీ పుస్తెల తాడును వృద్ధురాలికి ఇచ్చి గుండ్ల హారాన్ని అపహరించుకుపోయారు. అనంతరం వృద్ధురాలు తన ఇంటికి వచ్చి పుస్తెల తాడును తన మనుమడికి చూపించగా.. అది నకిలీది అని తెలుపడంతో కన్నీంటి పర్యంతమైంది. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. క్రైమ్ కానిస్టేబుల్ జాహవా సీసీ కెమెరాలను తనిఖీ చేసి నిందితులను గుర్తించారు. నిందితులను శంషాబాద్ సీసీఎస్ పోలీసుల సహాయంతో పట్టుకొని విచారించగా ఎరుకలి శ్రీను, ఎరుకలి అరుణలుగా గుర్తించారు. దొంగతనంపై విచారించగా మిడ్జిల్ మండలంలోని ఓ బంగారు దుకాణంలో గుండ్ల హారాన్ని విక్రయించినట్లు తెలిపారు. గతంలోనూ వీరిద్దరిపై దొంగతనం కేసులు ఉన్నాయని ఎస్సై శ్రీకాంత్ వివరించారు. గుండ హారాన్ని రికవరీ చేసినట్లు పేర్కొన్నారు.

కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఆచారి

ఆమనగల్లు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టాలని, ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల అమలులో పూర్తిగా విఫలమైందని ఎన్‌బీసీ మాజీ సభ్యుడు, బీజేపీ రాష్ట్ర నాయకుడు తల్లోజు ఆచారి ఆరోపించారు. అమలు కానీ హామీలతో అధికారంలోకి వచ్చి ప్రజలను మోసగించిన కాంగ్రెస్‌కు స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఆమనగల్లు పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో బుధవారం మండల, మున్సిపల్ బీజేపీ నాయకులు, కార్యకర్తలతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. మండల, మున్సిపాలిటీ అధ్యక్షులు ఎర్రవోలు శ్రీను, కర్నాటి విక్రమ్ రెడ్డిల అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ఆచారి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పార్టీ బలోపేతం, స్థానికంగా నెలకొన్న సమస్యలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం, ఈనెల 11న ఆమనగల్లు పట్టణంలో నిర్వహించే మహాదర్నా విజయవంతంపై చర్చించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు హరిప్రసాద్, గోరటి నర్సింహ, చెక్కాల లక్ష్మణ్, రవిరాథోడ్, మల్లయ్య, చెన్నకేశవులు, శ్రీశైలం యాదవ్, కృష్ణ, శేఖర్, యాదయ్య, కృష్ణయాదవ్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హయాంలోనే షాద్‌నగర్ అభివృద్ధి

షాద్‌నగర్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ హయాంలోనే షాద్‌నగర్ పట్టణాభివృద్ధి జరిగిందని నాయకులు అన్నారు. తాము చేపట్టిన పనులను మాత్రమే కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేస్తుందని ఆరోపించారు. బుధవారం షాద్‌నగర్ పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో పట్టణాధ్యక్షుడు ఎంస్ నటరాజన్ విలేకరులతో మాట్లాడుతూ షాద్‌నగర్ మాజీఎమ్మెల్యే అంజయ్య యాదవ్ తన హయాంలో పట్టణాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేశారని అన్నారు. పట్టణాన్ని మరింత అభివృద్ధి పర్చడానికి అంజయ్య యాదవ్ రూ.37 కోట్ల ప్రొసీడింగ్స్ తెచ్చారని, ఆలోపే అసెంబ్లీ ఎన్నికలు రావడంతో నిధులు మంజూరు కాలేదన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అప్పుడు మంజూరైన నిధులనే ఇప్పుడు మంజూరు చేయించి పనులు చేపడుతున్నారని విమర్శించారు. ఈ విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారన్న విషయాన్ని కాంగ్రెస్ నాయకులు గుర్తుంచుకోవాలని వారు అన్నారు.

బీజేపీ 'పట్నం' మున్సిపాలిటీ కార్యవర్గం


నియామక పత్రాలు అందుకున్న సభ్యులు

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ బీజేపీ కార్యవర్గాన్ని విస్తరించినట్లు ఆ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు ముత్యాల మహేందర్ తెలిపారు. బుధవారం ఇబ్రహీంపట్నంలో జరిగిన జరిగిన మున్సిపల్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. బీజేపీ మున్సిపల్ ప్రధాన కార్యదర్శులుగా జెనిగె శ్రీనివాస్ యాదవ్, పంది మహేందర్, ఉపాధ్యక్షులుగా ఆకుల సంతోష్‌కుమార్, చెరుకూరి సురేష్, పైలారం శివ, వనం నరేష్, కార్యదర్శులుగా సామ చంద్రశేఖర్‌రెడ్డి, వెన్నె అభిషేక్, మున్సిపల్ యువమోర్చా అధ్యక్షుడిగా శశిధర్‌రెడ్డి, కిసాన్ మోర్చా అధ్యక్షుడిగా బస్వాపురం గోవర్దన్, మహిళా మోర్చా అధ్యక్షురాలిగా రజిత, ఓబీసీ మోర్చా అధ్యక్షుడిగా ఆకుల సాయిరామ్‌లను ఎన్నుకున్నట్లు తెలిపారు. సీనియర్ నాయకులు ముత్యాల భాస్కర్, నాయిని సత్యనారాయణ, రాంరెడ్డి, రవీందర్‌రెడ్డి, రాఘవేంద్రస్వామి తదితరులున్నారు.

సుష్మాస్వరాజ్‌కు ఘన నివాళి


నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

చేవెళ్ల, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రిగా సుష్మా స్వరాజ్ చేసిన సేవలు చిరస్మరణీయమని బీజేపీ చేవెళ్ల పట్టణాధ్యక్షుడు అత్తెల్లి అనంతరెడ్డి అన్నారు. బుధవారం పట్టణ కేంద్రంలో దివంగత సుష్మాస్వరాజ్ వర్ధంతిని పురస్కరించుకని ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో శంకర్‌గౌడ్, దేవుని శర్వలింగం, ప్రవీణ్‌రెడ్డి, అశోక్, శ్రీకాంత్, జయసింహరెడ్డి, శ్రీనివాస్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.